గ్రూప్- 1స్క్రీనింగ్ టెస్ట్

పోటీ పరీక్షలకు అకడమిక్ పరీక్షలకు గల తేడాను పోటీ పరీక్షలు రాయాలనుకుంటున్న విద్యార్థులు గమనించాలి. అకడమిక్ పరీక్షల్లో 'బట్టీ పట్టి' అయినా మంచి మార్కులు సంపాదించే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షల సిలబస్ ఎక్కువ. అంతేకాకుండా 'అప్లికేషన్'రకం ప్రశ్నలతో అభ్యర్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. బట్టీ విధానం ద్వారా కూడా కొన్ని మార్కులను పోటీ పరీక్షల్లో పొందవచ్చు. అయితే మనం ఎంపిక కావడానికి ఆ మార్కుల సంఖ్య సరిపోదు. అందువల్ల అభ్యర్థులు ప్రతీ అంశంలోని అవసరమైన భావనలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. భావనలను ఒకసారి సరిగ్గా అర్థం చేసుకుంటే చాలా కాలం గుర్తుంటాయి. ఫలితంగా విస్తారంగా ఉన్న సిలబస్‌ను సులువుగా పూర్తి చేయవచ్చు. ఆపై జ్ఞాపకం పెట్టుకోవాల్సిన విషయంపై దృష్టి పెట్టడానికి సమయం లభిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఎదురయ్యే భావనలలో అవసరమైన కొన్నింటి విశ్లేషణ...

ఆర్థిక వృద్ధి

భారతదేశంలో 1990 తరవాత అమలుపర్చిన ఆర్థిక సంస్కరణల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నదని అందరికీ తెలుసు. అయితే కొందరు మాత్రం ఆర్థిక వృద్ధి రేటు పెరిగిందంటే ప్రజల జీవన ప్రమాణం ఎక్కువైనట్టే అని భావించే అవకాశం ఉంది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే ఆర్థికవృద్ధి కేవలం వస్తు, సేవల్లో పెరుగుదలను మాత్రమే సూచిస్తుంది. అంటే ఉత్పత్తిలో పెరుగుదలను సూచిస్తుంది. 'ఉత్పత్తిలో పెరుగుదలతో పాటు నిరుద్యోగం, పేదరికం, ఆదాయ అసమానతలు, సాంకేతిక పరిస్థితుల్లో మార్పు చోటుచేసుకుంటే దానిని ఆర్థికాభివృద్ధి' అంటారు. అంటే ఆర్థికాభివృద్ధి జరుగుతున్నది అంటే ప్రజల జీవన ప్రమాణంలో మార్పు వచ్చింది అని చెప్పవచ్చు. కాని కేవలం 'ఆర్థిక వృద్ధి' ఆధారంగా ప్రజల జీవన ప్రమాణం పెరిగిందని చెప్పలేం. మరో మాటలో చెప్పాలంటే. ప్రజా శ్రేయస్సు పెరగడం అనేది సంపద పెరగడం కంటే కూడా దాని పంపిణీ జరిగిన తీరుపై ఆధారపడి ఉంటుంది.

జాతీయాదాయం

ఒక దేశంలో, ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి జరిగిన అంతిమ వస్తు సేవల విలువకు విదేశీ నికర ఆదాయాన్ని కలుపగా వచ్చేది జాతీయాదాయం. అయితే మనం తరచూ చూసే స్థూల దేశీయోత్పత్తి (జిడిపి), స్థూల జాతీయోత్పత్తి (జిఎన్‌పి), నికర జాతీయోత్పత్తి (ఎన్‌ఎన్‌పి), ఉత్పత్తికారకాల ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి వీటన్నింటిలో జాతీయాదాయం అని దేనిని అనాలి? ఎందుకు దానినే అనాలి? అన్న విషయం అర్థం కావడానికి పై భావనలను అర్థం చేసుకోవాలి. అంతేగాని

భారత ఆర్థిక వ్యవస్థ

భావనలే ముఖ్యం

బండ గుర్తుగా 'ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని జాతీయాదాయం అంటారు' అని బట్టీపట్టకూడదు. ఎందుకంటే పై భావనను ఎన్నో రూపాల్లో అడిగే అవకాశం ఉంది. ఉదాహరణకు ఒకసారి సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలో 'కింది వాటిలో ఏది జాతీయాదాయంగా పిలవబడేది' అనే ప్రశ్నకు నాలుగు స్పందనల్లో 1) స్థూల జాతీయోత్పత్తి 2) స్థూల దేశీయోత్పత్తి 3) నికర జాతీయోత్పత్తి నుంచి పరోక్ష పన్నులను తీసివేసి సబ్సిడీలను కలుపగా వచ్చేది 4) స్థూల జాతీయోత్పత్తి నుంచి పరోక్ష పన్నులను తీసివేసి సబ్సిడీలను కలపగా వచ్చేది... అని ఉన్నాయి. బట్టీ స్వభావంతో చదివినవారు పై ప్రశ్నతో ఇబ్బందిని ఎదుర్కొని విలువైన సమయాన్ని అనవసరంగా ఖర్చు చేస్తారు. అందుకని ఆ భావనల పట్ల అవగాహన ఉండాలి.

స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)

మన దేశంలో ఒక సంవత్సర కాలంలో జరిగిన అంతిమ వస్తు, సేవల విలువ. అంటే ఉత్పత్తిని వాటి మార్కెట్ ధరలతో హెచ్చించి విలువ కడతారు. అంతిమ వస్తువులు అంటే ఇతర వస్తువుల ఉత్పత్తిలో సహకరించడం కోసం తిరిగి ఆ సంవత్సరం అమ్మకానికి పెట్టని వస్తువులు.

స్థూల జాతీయోత్పత్తి (జిఎన్‌పి)

మన దేశంలో ఒక సంవత్సరంలో జరిగిన అంతిమ వస్తు, సేవల విలువకు విదేశీ నికర ఆదాయం కలుపగా వచ్చేది. విదేశీ నికర ఆదాయం అంటే విదేశాల నుంచి మనకు వచ్చిన ఆదాయం నుంచి విదేశాలకు పోయే ఆదాయాన్ని తీసివేయగా వచ్చేది.

అంటే స్థూల దేశీయోత్పత్తిలో విదేశీ నికర ఆదాయం ఉండదు. స్థూల జాతీయోత్పత్తిలో విదేశీ నికర ఆదాయం ఉంటుంది.

డాక్టర్ టి.సాయిలు

నికర జాతీయోత్పత్తి

స్థూల జాతీయోత్పత్తి నుంచి తరుగుదల విలువను తీసివేయగా వచ్చేది. దీనిని మార్కెట్ ధరల్లో నికర జాతీయోత్పత్తి అని కూడా అంటారు. 'తరుగుదల' అంటే ఉత్పత్తి క్రమంలో యంత్రాలు పొందిన నష్టం. దానికి విలువ కట్టి స్థూల జాతీయోత్పత్తి నుంచి తీసివేయగా వచ్చేదే నికర జాతీయోత్పత్తి.

ఉత్పత్తికారకాల ధరల్లో నికర జాతీయోత్పత్తి

మార్కెట్ ధరల్లో వచ్చిన నికర జాతీయోత్పత్తి నుంచి పరోక్ష పన్నులను తీసివేసి సబ్సిడీలను కలపగా ఉత్పత్తి కారకాల ధరల్లో నికర జాతీయోత్పత్తి వస్తుంది.

పరోక్ష పన్నులు

పన్ను భారాన్ని బదిలీ చేసే అవకాశం గల ఎక్సైజ్ సుంకం, అమ్మకం పన్నులను పరోక్ష పన్నులు అంటారు. ఉదాహరణకు ఎక్సైజ్ సుంకాన్ని ఉత్పత్తిదారుడిపై విధిస్తారు. కాని ఆ భారం చివరికి వినియోగదారునికి బదిలీ అవుతుంది. అమ్మకం పన్నును అమ్మకందారునిపై విధిస్తారు. కాని అది కూడా అంతిమంగా వినియోగదారునికి బదిలీ అవుతుంది.

సబ్సిడీ

వస్తువు ఉత్పత్తి జరిగిన వ్యయం కంటే తక్కువగా ధరను నిర్ణయించి వినియోగదారుడికి అందిస్తారు. ఆ తేడాను ప్రభుత్వం భరిస్తుంది. ఆ తేడా మొత్తాన్ని 'సబ్సిడీ' అంటారు.

ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తినే 'జాతీయాదాయం' అని పేర్కొంటారు. ఎందుకంటే వస్తువు ఉత్పత్తిలో పాల్గొన్న కారకాల (శ్రమ, మూలధనం, భూమి, వ్యవస్థాపకుడు)కు వాటి ప్రతిఫలాన్ని (ధర) చెల్లించినప్పుడు గల వస్తువుల విలువను ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి సూచిస్తుంది.

తలసరి ఆదాయం

జాతీయాదాన్ని దేశ జనాభాతో భాగిస్తే 'తలసరి ఆదాయం' వస్తుంది.

వాస్తవిక జాతీయాదాయం

వస్తు, సేవలను వాటి ధరల ఆధారంగా అంచనా వేస్తాం. అయితే ధరలలో పెరుగుదల కారణంగా జాతీయాదాయం పెరిగినట్లు కనిపిస్తుంది. ఈ ధరల ప్రభావాన్ని తటస్థం చేసేందుకు గతంలోని ఒక సంవత్సరం (ఆధార సంవత్సరం) ధరల ఆధారంగా జాతీయాదాయాన్ని లెక్కించినప్పుడు వచ్చేది వాస్తవిక జాతీయాదాయం.

వాస్తవిక తలసరి ఆదాయం

వాస్తవిక జాతీయాదాయాన్ని దేశ జనాభాతో భాగించగా వచ్చేది వాస్తవిక తలసరి ఆదాయం.

వాస్తవిక తలసరి ఆదాయంలో పెరుగుదలను దేశ ఆర్థిక వృద్ధికి నిజమైన సూచికగా భావిస్తారు. ఒకసారి సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలో దేశ ఆర్థికవృద్ధికి నిజమైన సూచిక ఏది? అని ప్రశ్న అడిగి, స్పందనలుగా స్థూల దేశీయోత్పత్తిలో పెరుగుదల, స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, తలసరి ఆదాయంలో పెరుగుదల, వాస్తవిక తలసరి ఆదాయంలో పెరుగుదలను ఇచ్చారు. పై ప్రశ్నకు గాని మనం ఇంతకుముందు ఉదహరించిన ప్రశ్నకు గాని పై భావనలను అర్థం చేసుకున్న అభ్యర్థి ఒక్క క్షణంలో సమాధానం గుర్తిస్తాడు. బట్టీపట్టిన అభ్యర్థి మాత్రం సమయాన్ని అనవసర ఖర్చు చేస్తాడు.

•

ఈటీఎస్ స్కాలర్‌షిప్‌లు

ఇటీవల 'టోఫెల్ ఇండియా స్కాలర్ ప్రోగ్రామ్'ను ఎడ్యుకేషనల్ ట్రస్టింగ్ సర్వీస్(ఈటిఎస్) ప్రకటించింది. ఈ ప్రోగ్రామ్ కింద వివిధ దేశాల్లో 2010లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు వివిధ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.
ఈటిఎస్ అందించే స్కాలర్‌షిప్‌లలో10 వేల డాలర్ల విలువ చేసేవి మూడున్నాయి. వాటిలో ఒక్కోదాన్ని అమెరికా, ఇంగ్లండ్, కెనడా దేశాల్లో చదివే ఒక్కో విద్యార్థికి అందిస్తారు. అలాగే అయిదు వేల డాలర్ల విలువజేసే మరో నాలుగు స్కాలర్‌షిప్‌లను సైతం అంది

స్కాలర్‌షిప్‌లు

స్తుంది. వాటిని పై మూడు దేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులెవరికైనా అందిస్తుంది. (అంటే..ఒకే దేశంలో చదివే నలుగురు విద్యార్థులకైనా అందివ్వొచ్చు. లేదా రెండు దేశాల్లో.. అలా..అలా)

ఎంపిక విధానం

టోఫెల్ స్కోర్స్, గతంలో ప్రదర్శించిన ప్రతిభ, విద్యేతర కార్యక్రమాలు, విశ్లేషణ సామర్థ్యం, నూతన ఆలోచనలను పరీక్షించి ఈటిఎస్ నిపుణులు అంతిమ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. అందుకోసం అభ్యర్థులు రెండు వేల పదాలతో ఒక వ్యాసం రాసి పంపించాలి. అంతిమంగా ఎంపిక చేసిన విద్యార్థులకు మౌఖిక పరీక్ష ఉంటుంది.
దరఖాస్తులకు, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ చూడండి. www.ets.org/toefl/indiascholorships

నార్త్ సౌత్ ఫౌండేషన్

అమెరికా కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న ''నార్త్ సౌత్ ఫౌండేషన్''(ఎన్ఎస్ఎఫ్) స్వదేశంలో విద్యను అభ్యసించే ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించడం ఆనవాయితీగా పెట్టుకుంది.
ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, అగ్రి-ఇంజనీరింగ్, వెటర్నరీ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్‌లను పరిమితం చేసింది. నిరుపేదల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్‌లను పరిమితం చేసినట్లు ఎన్ఎస్ఎఫ్ నిర్వాహకులు తెలిపారు.

అర్హతలు

1. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో 45 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో 32 వేలు మించి ఉండరాదు.
2. ఆయా కోర్సులకు ఉద్దేశించిన కామన్ ఎంట్రన్స్ పరీక్షల్లో అభ్యర్థులు తొలి తొలి 5 శాతం జాబితాలోని వారై ఉండాలి. గ్రామీణ విద్యార్థులకు, విద్యార్థినులకు 5 శాతం మినహాయింపు ఉంది.
3. తొలి ప్రయత్నంలో రాంక్ సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పిస్తారు.
4. ప్రభుత్వ పాఠశాలల్లో లేదా ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు మాత్రమే అర్హులు.
5. ఆయా కోర్సుల్లో మొదటి సంవత్సరం విద్యను అభ్యసించే వారు మాత్రమే అర్హులు.

మన రాష్ట్ర విద్యార్థులు దరఖాస్తులు పంపాల్సిన చిరునామాలు:

కోస్తా ప్రాంతం వారు:

డాక్టర్ ఎస్. గోపాల శాస్త్రి, సీతా నివాస్, 48-9-16, ద్వారకానగర్, విశాఖపట్టణం-530 016..

ఇతర ప్రాంతాల వారు:

డి. సీతారామయ్య, రూం నంబర్-316. మూడో అంతస్తు, మోడల్ హౌజ్, పంజగుట్ట, హైదరాబాద్-500 082.

దరఖాస్తు విధానం:

విద్యార్థులు తమ వివరాలతో కూడిన దరఖాస్తుకు, రాంక్ కార్డు ప్రతిని, సొంత చిరునామాతో పాటు తగు స్టాంపులు అంటించిన ఎన్వలప్‌ను జతచేసి పంపించాలి.

(గతవారం తరువాయి)

పాలిటీ..

ప్రత్యేకంగా పేర్కొన్న మరో అంశం 'ప్రణాళికల'కు సంబంధించి, ప్రణాళికా భావన, రకాలు, భారత ప్రణాళికల స్వభావం, సాధారణ లక్ష్యాలు, వివిధ ప్రణాళికల రంగాల వారి కేటాయింపులో ప్రాధాన్యక్రమాలను అభ్యర్థి సునిశితంగా పరిశీలించాలి, అర్థం చేసుకోవాలి, జ్ఞాపకం పెట్టుకోవాలి. ప్రత్యేకంగా పేర్కొన్న మరో అంశం 'భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు'.

దీనిలో ఆర్థిక సంస్కరణల ఆవశ్యకత, ఆరంభం, ఆర్థిక సంస్కరణల్లో భాగంగా అమలుపర్చిన-

1. పారిశ్రామికరంగ సంస్కరణలు
2. ప్రభుత్వరంగ సంస్కరణలు
3. విదేశీరంగ సంస్కరణలు
4. విత్త విధాన సంస్కరణలు
5. ద్రవ్యరంగ సంస్కరణలు

ఆర్థికవృద్ధి, విదేశీ మారక ద్రవ్య నిల్వలు, విదేశీ పెట్టుబడులు, ఉద్యోగిత, పేదరికం, ఆదాయ అసమానతలపై ఆర్థిక సంస్కరణల ప్రభావాలను పరిశీలన దృష్టితో చదివి అవగాహన పొందాలి.

మెటీరియల్

ఆంగ్లంలో చదవగలిగే అభ్యర్థులు ఇండియన్ ఎకానమీ పేరుతో ఎస్.కె.మిశ్రా, వి.కె.పూరీ రచించిన పుస్తకాన్ని గాని; రుడార్ దత్, కె.పి.ఎం.సుందరం రచించిన పుస్తకాన్ని గాని; ఎ.ఎన్.అగర్వాల్ రచించిన పుస్తకాన్ని గాని చదవవచ్చు.

అప్‌డేట్ కోసం 'కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ' ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు విడుదల చేసే 'ఆర్థిక సర్వే'ను చదవాలి.

తెలుగులో మాత్రమే చదవగలం అనే అభ్యర్థులు తెలుగు అకాడమీ ప్రచురించిన 'పోటీ పరీక్షల ప్రత్యేకం - భారత ఆర్థిక వ్యవస్థ - సమస్యలు' అనే పుస్తకాన్ని చదవాలి.

అప్‌డేట్ కోసం ప్రముఖ తెలుగు దినపత్రికలు, పోటీ పరీక్షల కోసం ప్రచురితమౌతున్న ప్రత్యేక తెలుగు 'మేగజైన్లు' ఆంగ్లంలో ఉన్న ఆర్థిక సర్వేను అనువదించి ప్రధానాంశాలను ప్రచురిస్తాయి. ఆంగ్లంలో లభించే పుస్తకాలు, ఆర్థిక సర్వే హైదరాబాద్‌లోని కోఠి, కాచిగూడలలో గల ప్రముఖ పుస్తకాల షాపుల్లో లభ్యమవుతాయి.

తెలుగు అకాడమీ పుస్తకాలు - హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గల తెలుగు అకాడమీలో, రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో గల ప్రముఖ పుస్తకాల షాపుల్లో లభిస్తాయి.

తెలుగులో ప్రచురితమయ్యే పోటీ పరీక్షల పత్రికలు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పట్టణాల్లో గల బుక్‌స్టాల్స్‌లో లభిస్తాయి. గ్రామాల్లోని అభ్యర్థులు సంబంధిత పత్రిక కోసం వార్షిక చందా పంపితే తమ చిరునామాకు నేరుగా ఏడాది కాలం పత్రికను పంపుతారు.

రాష్ట్రంలోని ప్రముఖ లైబ్రరీల్లో పై పుస్తకాలు, రిపోర్టులు, పత్రికలు అందుబాటులో ఉంటాయి. పేద విద్యార్థులు లైబ్రరీలను వినియోగించుకోవాలి.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలపై వ్యాస రచయిత సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథం 'భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు - సామాజికరంగంపై వాటి ప్రభావం' ఉపకరిస్తుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జనరల్ లైబ్రరీ, పరిశోధనా విభాగంలో అందుబాటులో ఉంది.

చుక్కాని

చుక్కా రామయ్య

చదువంటే..?

పిల్లలతో తిరిగితే వాళ్ల జీవితంలో బతకడం ఎలా నేర్చుకున్నారో బోధనకు ఎరువుగా ఉపయోగపడుతుంది. పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో ఉపాధ్యాయుడు పరిశీలించాలి. వాటినే అమలుపరచాలి.

చదువు ఎవరికోసం? చదువు ఎక్కడ నుంచి ఉత్పత్తి అవుతుంది? Education for the people by the people on the people to the people. దీనినే విద్య ప్రజాస్వామికీకరణ అంటారు. గురువు, విద్యార్థి ఇద్దరిలోను ఆలోచన తరంగాలుంటాయి. ఉభయులకూ భావాలుంటాయి. ఆ భావాల సంఘర్షణే చదువు. పిల్లంటే ఏమి రాయని పలక (క్లీన్ స్లేట్) అంటారు. దానిపై ఇష్టం వచ్చినట్లు రాయవచ్చు అనుకుంటారు. ఇది పాత సిద్ధాంత భావన. పిల్లలు చిన్న ప్పటి నుంచి ఎన్నో విషయాలు చూస్తారు, వింటారు. ఎన్నో అనుభవాలు సంపాదిస్తారు. బడికి రాకముందే లెక్కలు చేయగలుగుతారు.

తల్లి పిల్లవాడి చేతిలో పైసలు పెట్టి ఉప్పు, సబ్బు, నూనె బజారుకెళ్లి కొనుక్కురమ్మంటుంది. ఒక్క పైసా లెక్క తప్పకుండా వాటిని కొనుక్కువస్తాడు. అతనికి వస్తువుకు, ధనానికి ఉన్న మారకం తెలుసు. కొన్న వస్తువుల ధరలు చూస్తుంటాడు. వాటినన్నింటినీ కూడతాడు. ఆ రూపాయిని తీసేస్తాడు. వచ్చింది కరెక్టో కాదో చూసుకుంటాడు. ఈ జ్ఞానంతో పిల్లలు స్కూలుకు వస్తారు. పిల్లల జ్ఞానాన్ని తక్కువ అంచనా వేయకూడదు. మన భావాలు బలవంతంగా పిల్ల లపై రుద్దుతాం. పిల్లలు జీవితాల నుంచి వచ్చారు. ఉపాధ్యాయులు పుస్తకాల నుంచి వస్తున్నారు. అక్కడే సంఘర్షణ మొదలవుతుంది. పన్నెండు నుంచి 9 తీసివేయమంటే దానిని దస్కమని 12 అనుకొని 9 తీసివేయమంటాం. దానికి బదులు 12 రూపాయలు చేతిలో ఉంచుకొని 9 రూపాయలు తీసుకోమంటే - ఒకటి పది రూపాయల నోటు, రెండు విడి రూపాయలు - తొమ్మిది రూపాయలు తీసుకోమని చెప్పండి. అప్పుడు పిల్లలు ఏం చేస్తారో చూడండి. ఆ పది రూపాయలను విడిపించండని పిల్లవాడంటాడు. అలా విడిపించమని పిల్లలు చెప్పటమే నిజమైన చదువు. ఒక కాగితాన్ని 10 కాగితాలుగా తయారు చేయడమే చదువు. అదే పిల్లల అనుభవంతో వచ్చిన చదువు. దానిని చదువుకు ఆధారం చేసుకోవాలి.

పిల్లల పూర్వ జ్ఞానాన్ని గుర్తించాలి. అదే మాదిరిగా పుస్తకాలను చదివితే ప్రజల కోరికలు తెలియవు. ప్రజల్లో కలిసి తిరిగితే వాళ్ల మనోభావాలను బాగా అర్థం చెసుకొవచ్చు. ప్రజల మనోభావాలను కనుక్కోవడం ప్రజాస్వామ్యానికి సంబంధించి మొదటి లక్షణం.

అదే మాదిరిగా ఉపాధ్యాయుడు పిల్లల మనోభావాలను కనుక్కోవాలి. పిల్లలతో తిరిగితే వాళ్ల జీవితంలో బతకడం ఎలా నేర్చుకున్నారో బోధనకు ఎరువుగా ఉపయోగపడుతుంది. పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో ఉపాధ్యాయుడు పరిశీలించాలి. వాటినే అమలుపరచాలి. ఉపాధ్యాయుడు పిల్లల స్థాయికి రావడం చాలా కష్టం. ఎటు అంటే అటు ఒరిగిపోయే పిల్లల మనస్తత్వాన్ని ఉపాధ్యాయుడు పట్టుకోవాలి. ఉత్తమ ఉపాధ్యాయుడు పిల్లల మనస్తత్వం కలిగి ఉంటాడు. అలాంటి వారికే బోధన పద్ధతులు తెలుస్తాయి. ఇది మొదటి లక్షణం.

టు ది పీపుల్ అంటే చదువు ఎవరి కోసం? పిల్లల కోసమా? పరీక్షల కోసమా? తల్లిదండ్రుల కోసమా? ప్రభుత్వం కోసమా? ఎవరికోసం? అదే పరాయి ప్రభువులైతే చదువుతో బానిస లక్షణాలను నేర్పుతారు. అదే నిరంకుశ ప్రభువైతే విశ్వసపాత్రుల కోసం చదువును తయారుచేస్తారు. అదే ప్రజాస్వామిక ప్రభుత్వమైతే పిల్లలను ఆలోచించే వారిగా తయారుచేయాలి. అంటే ప్రభుత్వ స్వభావంపై చదువు ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రుల కోసమే చదువైతే మార్కుల కోసం చదువు చెప్పాలి. అదే పంతులు కోసమైతే పాఠ్య పుస్తకాల సిలబస్ కోసం చెప్పాలి. అంటే ఎవరి కోసం చెబుతారన్నార న్నదే ప్రశ్న. ఎవరి కోసం కాదు పిల్లల కోసమే చెప్పాలి. పిల్లల కోసమైతే అది వారి మెదళ్లలో కదలికలు తేవాలి. అది వారిలో కొత్త చైతన్య జ్వాలలు రగిలించాలి. అదే బోధన. అదే చదువు. అదే జ్ఞాన అన్వేషణ.

అటవీ అధ్యయనపరుల వేదిక ఐఐఎఫ్ఎం

పర్యావరణ పరిరక్షణ, సంబంధిత వ్యవస్థ సుస్థిరాభివృద్ధికి అవసరమైన నాయకత్వాన్ని దేశానికి అందించాలనే ఆశయంతో ఏర్పాటైన సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం). సహజవనరులైన అడవులు, సంబంధిత అంశాల అధ్యయనానికి ఏర్పాటైన సంస్థ ఐఐఎఫ్ఎం. ఆసియా ఖండంలోనే దీనికి మంచి పేరుంది. సంస్థ ఆవిర్భావానికి సంబంధించిన బీజం 1974లోనే పడింది.

అటవీ వాణిజ్యానికి నిర్వహణపరమైన దృక్పథాన్ని జత చేయాలని ఎఫ్ఏఒ, ఎస్ఐడిఎ ప్రత్యేకించి అప్పట్లో చేసిన సిఫార్సులు బాగా పని చేశాయి. ఆ దిశగా రూపుదిద్దుకున్న సంస్థే ఐఐఎఫ్ఎం. బిజినెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, అప్లయిడ్ ఎకనమిక్స్, సాధ్యాసాధ్యాలపై అధ్యయనం (ఫీజిబిలిటీ స్టడీస్), వ్యయ నియంత్రణ, టింబర్ హార్వెస్టింగ్‌కు సంబంధించిన ఎకనమిక్స్ తదితరాలను ఫారెస్ట్రీకి జత చేయాలన్నది ప్రధాన సిఫార్సు. అందువల్లే ఈ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ట్రైనింగ్ ప్రాజెక్ట్‌ను ఎస్ఐడిఎ కు అప్పగించారు. చివరకు ఇది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్‌గా రూపొందింది. దీని చట్టం ప్రకారం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి సంస్థకు ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరిన వ్యక్తులకు, అలాగే అటవీ విభాగాలు, అటవీ అభివృద్ధి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన మేనేజీరియల్ శిక్షణ అందించడం ఈ సంస్థ ఆశయాల్లో ఒకటి. తద్వారా అటవీ అభివృద్ధి, అలాగే మేనేజ్‌మెంట్‌లో వృత్తిపరంగా నిపుణులుగా వారిని తీర్చిదిద్దాలన్నది సంస్థ సంకల్పం. అటవీ సంబంధిత వ్యవస్థల్లో ఇమిడిపోయే, ప్రధానంగా నిర్వహణ బాధ్యతలను భుజాన వేసుకునే స్థాయిలో మానవ వనరులను మలచాలన్న ప్రయత్నంతో ఈ సంస్థ ముందుకు పయనిస్తోంది. మరికొన్ని విస్తృత బాధ్యతల్ని కూడా ఈ సంస్థ చేపట్టింది.

అటవీ వనరులు, పర్యావరణ రంగాల్లో పరిశోధన, కన్సల్టెన్సీ, ప్రచురణలు తదితర కార్యకలాపాలతో అటవీ, సంబంధిత వ్యవస్థలకు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి సమాచారాన్ని అందిస్తుంది. అలాగే అటవీ పరిశోధనకు సహకరించడం, స్వయంగా చేపట్టడం సంస్థ బాధ్యతల్లో భాగంగానే ఉన్నాయి. ఈ రంగాల్లో కృషి చేసే వారికి సహాయంగా ఉండేందుకు సంస్థ ఇచ్చే మెడల్స్, స్కాలర్‌షిప్పులు వంటివి సరేసరి.

సంస్థ ఏర్పాటు

భోపాల్‌లోని నెహ్రూ నగర్‌లో కొండపైన 200 ఎకరాల సువిశాల పచ్చిక ఆవరించి ఉన్న ప్రాంతంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఏర్పాటైంది. 35,000 వాల్యూముల పుస్తకాలు, జర్నల్స్ తదితరాలతో మంచి లైబ్రరీ సదుపాయం ఇక్కడి విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. డెల్‌నెట్ సదుపాయం ఉంది. అదేవిధంగా హాస్టల్ రూములన్నింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఉంది. మొత్తమ్మీద అటవీ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ దిశగా ఈ సంస్థ ఇతోధిక కృషిని సాగిస్తోందని ఇట్టే చెప్పవచ్చు.

పీజీ కోర్సు చేసిన విద్యార్థులకు ఓలమ్ ఇంటర్నేషనల్, ఎస్‌కెఎస్ మైక్రో ఫైనాన్స్, ఐసిఐసిఐ, ఐటిసి లిమిటెడ్, సిఎంఎఫ్ఆర్, ఆసియా కార్బన్, ఎయిడ్ ఎట్ యాక్షన్, ఎటిఆర్ఇఇ, ఎఫ్‌డబ్ల్యుడబ్ల్యుబి, గ్రామీణ కూట తదితర ప్రఖ్యాత సంస్థలు ఇక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటున్నాయి. ఇక్కడ కోర్సు చేసిన అభ్యర్థులకు వంద శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నారు.

రాబోయే విద్యా సంవత్సరానికిగాను రెండేళ్ల పీజీ ప్రోగ్రామ్ ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్, అలాగే పరిశోధనకు ఐఐఎఫ్ఎం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పీజీ కోర్సుకు కనీసం 50 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 45 శాతం) మార్కులతో ఏ డిసిప్లెయిన్‌లోనైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు.

ఈ కోర్సుపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు మొదట క్యాట్‌లో స్కోర్ సాధించాలి. ఆపై గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి. ఐఐఎఫ్ఎం నిర్దేశిత దరఖాస్తునూ పూర్తి చేసి పంపాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్:
www.iifm.ac.in/a dmission
ఇ - మెయిల్:
admission@iifm.ac.in

- ఎమ్కే